క్లుప్తంగా

మహంకాళి రూపంలో దుర్గాదేవి



మహంకాళి అవతారంలో దుర్గాదేవి

కెరమెరి: మండల కేంద్రంలోని తుజాలపురం కాంప్లెక్స్‌లోని దుర్గాదేవి గుడిలో బుధవారం మహంకాళి రూపంలో దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

'వంతెన నిర్మించకుంటే ఎన్నికలు బహిష్కరిస్తాం'



ఫ్లకార్డులతో నిరసనలు తెలుపుతున్న ప్రజలు

కెరమెరి: అనార్‌పల్లి వాగుపై వంతెన నిర్మాణ పనులు ప్రారంభించకపోతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని కరంజీవాడ, గోండుగూడ, అందుగూడ గ్రామాల ప్రజలు తీర్మానించారు. బుధవారం రహదారిపై ఫ్లకార్డులతో నిరసనలు తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి వంతెన నిర్మాణంపై నిర్ణయం తీసుకునేవరకు ప్రచారం నిర్వహించడం, ఓట్లు వేయడం జరగదని హెచ్చరించారు.

ఘనంగా తులసీ వన మహోత్సవం



తులసీ మొక్కలు నాటుతున్న తహసీల్దార్

బెజ్జూర్: మండల కేంద్రంలోని శ్రీరంగనాయక ఆలయంలో బుధవారం తులసీ వన మహోత్సవం నిర్వహించారు. రంగనాయక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 108 తులసీ మొక్కలను తహసీల్దార్ రామ్మోహన్‌రావు ఆలయ ప్రాంగణంలో నాటారు. మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరూ తీసుకోవాలన్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బెజ్జూర్ ఆలయ కమిటీ అధ్యక్షుడు తంగడపల్లి మహేశ్, ఆర్‌ఐ గోపాల్, జగ్గా గౌడ్, రాచకొండ శ్రీవర్ధన్, గ్రామస్తులు పెద్దల శంకర్, ఏలేశ్వరం శ్రీకాంత్, రంగయ్య, శ్రీరామ మోహన్, భాస్కర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

'కంకలమ్మ'కు దారేది..!

- ఏటా ఆలయంలో మహా జాతర
- అధ్వానంగా రోడ్డు
- పర్యాటక ప్రాంతంగా గుర్తించాలని వినతి



ఆలయంలోని కంకలమ్మ దేవి విగ్రహం



ఆలయానికి వెళ్లే మొరం రోడ్డు

కౌటాల: కౌటాల సమీపంలోని ఎత్తైన గుట్టపై వెలసిన స్వయంభూ శ్రీ కంకలమ్మ –కేతేశ్వర స్వామి ఆలయంలోని కంకలమ్మ భక్తుల కోర్కెలు తీర్చే దేవిగా విరాజిల్లుతోంది. దేవిని దర్శించుకునేందుకు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులు వస్తుంటారు. ఈ ఆలయం ప్రకృతి ఒడిలో ఉండడంతో పర్యాటక శోభను సంతరించుకుంటోంది. ప్రతీ ఏడాది ఆలయంలో కంకలమ్మ జాతరను ఘనంగా నిర్వహిస్తుంటారు. ఎంతో ప్రాముఖ్యత కలిగిన ఆలయానికి వెళ్లడానికి సరైన రోడ్డు మార్గం లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు.

భక్తుల వరాల దేవి..

మండల కేంద్రంలో వెలసిన కంకలమ్మ –శ్రీ కేతేశ్వరులు భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. కౌటాల, బెజ్జూర్, సిర్పూర్ మండలాల పరిధిలో కరువు కాటకాలు సంభవించిన కాలంలో భక్తులు ఇక్కడకు వచ్చి పూజలు నిర్వహించేవారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రతీ కార్తికమాసం చివరి ఆదివారం జాతర మహోత్సవం ఘనంగా నిర్వహిస్తారు. లేత బొంగులు వచ్చే ఈకాలంలో మేదరి కులస్తులు ప్రత్యేకంగా పూజలు చేసి మొక్కులు తీర్చుకుంటారు. దేశంలో కంకలమ్మ కేతేశ్వర స్వామి ఆలయాలు రెండే ఉండగా ఒకటి కౌటాల మండలంలో కంకలమ్మ దేవాలయం, రెండొవది కర్నాటక రాష్ట్రం చిత్ర దుర్గలో ఉంది.

ఆలయానికి రోడ్డు కరువు..

కౌటాల కంకలమ్మ దేవి ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించి అభివృద్ధి చేయాలని మండల వాసులు పేర్కొంటున్నారు. ఆలయానికి వచ్చే భక్తులు మెట్లదారిలో కాలినడకన గుట్టపైకి చేరుకోవాల్సి ఉండగా చుట్టూ ఉన్న గుట్టలు, అడవి ప్రకృతి దృశ్యాలు ఎంతో ఆకట్టుకుంటాయి. కంకలమ్మ గుట్టపై ఉన్న దేవతల పురాతన విగ్రహాలు భక్తులను ఆకట్టుకుంటున్నాయి. కంకలమ్మ గుట్టపై నుంచి కౌటాల మండలంలోని అందాలను తిలకించవచ్చు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కంకలమ్మ ఆలయం గుట్టపై నుంచి కౌటాల అందాలు, చుట్టూ ఉన్న గుట్టల ప్రకృతి అందాలు చూడడానికి మండలంలోని ఆయా గ్రామాల నుంచి పర్యాటకులు, యువకులు వస్తుంటారు. ఆలయం వద్ద యువకులు సెల్‌ఫోన్‌లో సెల్ఫీలు దిగుతూ సందడి చేస్తున్నారు. కంకలమ్మ ఆలయం గుట్టపై ఉండడంతో ఆలయానికి వెళ్లేందుకు మొరం రోడ్డు వేశారు. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో మొరం రోడ్డు కోతకు గురైంది. దీంతో భక్తులు ఆలయానికి వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కంకలమ్మ ఆలయానికి వెళ్లడానికి బీటీ రోడ్డు వేయాలని భక్తులు కోరుతున్నారు.

దాతల సహకారంతో..



కంకలమ్మ దేవి మా కోరికలు తీర్చుతుంది. కరువు కాలంలో ఆలయానికి వచ్చి కంకలమ్మ దేవికి మొక్కి గుట్ట కిందికి దిగేలోపు వర్షం కురుస్తోంది. ఆలయాన్ని దాతల సహాయంతోనే అభివృద్ధి చేస్తున్నారు. మండల కేంద్రం నుంచి ఆలయానికి వెళ్లేందుకు మొరం రోడ్డు ఉంది. భారీ వర్షాలకు రోడ్డు కోతకు గురై అధ్వానంగా మారింది. అధికారులు స్పందించి ఆలయం వరకు తారు రోడ్డు నిర్మించాలి. – రాములు, భక్తుడు, కౌటాల

పర్యాటకంగా గుర్తించాలి



కౌటాల మండలంలో కంకలమ్మ ఆలయం ఉండటం గొప్ప విషయం. ఆలయానికి తిరుమల తిరుపతి దేవస్థానం గుర్తింపునిచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం మండల కేంద్రం సమీపంలోని గుట్టపై ఉన్న కంకలమ్మ ఆలయాన్ని పర్యాటక ప్రాంతంగా గుర్తించి ఆలయాల అభివృద్ధికి నిధులు కేటాయించాలి.

– సుల్వ కనకయ్య, కంకలమ్మ ఆలయ చైర్మన్

దసరా ఉత్సవాలకు ఏర్పాట్లు

రెబ్బెన: మండలంలోని ప్రజలు గురువారం నిర్వహించే దసరా ఉత్సవాల కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల కేంద్రంతో పాటు, గోలేటి టౌన్‌షిప్‌లో నిర్వహించే రావణ దహనం కోసం నిర్వాహకులు అన్ని సిద్ధం చేశారు. దశకంఠుడు రావణ బ్రహ్మ బొమ్మలను తయారు చేసి దసరా ఉత్సవాల్లో భాగంగా దహనం చేసేందుకు ఏర్పాటు చేశారు. గోలేటి, రెబ్బెన మండల కేంద్రంలో ముందుగా శమీ పూజలు నిర్వహించిన అనంతరం రావణ దహనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం సమీపంలో, గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో దసరా ఉత్సవాలు, రావణ దహన కార్యక్రమాల కోసం ఏర్పాట్లు చేశారు.



రేణుక ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన రావణుడి బొమ్మ

తాళం వేసిన ఇళ్లే టార్గెట్

- పండుగ పూట చోరీలు
- భయాందోళనలో ప్రజలు

కాగజ్‌నగర్ టౌన్: తాళం వేసిన ఇళ్లే వారి లక్ష్యం. దర్జాగా లోపలికి చొరబడి ఉన్నదంత లూటీ చేస్తున్నారు. రెక్కలు ముక్కలు చేసుకొని కూడబెట్టిన సొమ్మునంతా దోచుకెళ్లడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఇటీవల కాగజ్‌నగర్ పట్టణంలోని పలు కాలనీల్లో జరిగిన దొంగతనాలతో పట్టణ వాసులు భయాందోళన చెందుతున్నారు.

ఇటీవల జరిగిన ఘటనలు..

- అక్టోబర్ 29న కాగజ్‌నగర్ పట్టణంలోని ఓల్డ్ కాలనీలోని క్వాటర్ నెం 111లోని కుటుంబ సభ్యులు సద్దుల బతుకమ్మ ఆడేందుకు ఇంటికి తాళం వేసి వెళ్లారు. వారు వచ్చేలోగా గుర్తు తెలియని దుండగులు బంగారం, నగదు దోచుకెళ్లారు.
- ఇటీవల పట్టణంలోని సర్‌సిల్క్ కాలనీలోని సర్‌సిల్క్ క్వాటర్‌లో రాత్రి తాళం వేసి ఉన్న ఇంటిని గమనించి చోరీకి పాల్పడ్డారు.
- కొన్ని రోజుల క్రితం బాలాజీనగర్, శ్రీరాంనగర్ కాలనీల్లో తాళం వేసిన ఇండ్లలోకి చొరబడి ఇంట్లోని బీరువా పగలగొట్టి చిందరవందర చేసి నగదు ఎత్తుకెళ్లారు.



ఓల్డ్ కాలనీలో ఇంటి పైకప్పు పగలగొట్టిన దొంగలు

- రెండు నెలల క్రితం కాపువాడలో ఓ మహిళ ఇంటి ముందు కూర్చుండి ఉండగా గుర్తు తెలియని దుండగుడు మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లాడు.

పోలీసుల నిర్లక్ష్యం..

కాగజ్‌నగర్ పట్టణంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నా.. పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రజల ఇళ్లకు తాళాలు వేసి బయటకు వెళ్లాలంటే భయాందోళన చెందుతున్నారు. దసరా పండుగ కావడంతో చాలా మంది ఇళ్లకు తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్తుంటారు. దొంగలు ఇలాంటి ఇళ్లే టార్గెట్ చేసి అందినకాడికి దోచుకెళ్తున్నారు. పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

కౌటాల: మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం భక్తిశ్రద్ధలతో సద్దుల బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. చిన్నారులు, మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో బతుకమ్మ పాటలు పాడుతూ.. సందడి చేశారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలో చిర్రకుంట, మోతుగూడ, బూర్గుడతో పాటు పలు గ్రామాల్లో బుధవారం సద్దుల బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు అనేక రకాల పూలతో బతుకమ్మను తయారు చేసి బతుకమ్మ చుట్టూ ఆడుతూ పాటలు పాడారు.



గుడ్లబోరిలో బతుకమ్మతో చిన్నారి

నిబంధనలు పాటించాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

బెజ్జూర్: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రతిఒక్కరూ నిబంధనలు పాటించాలని బెజ్జూర్ ఎస్సై సర్తాజ్ పాషా అన్నారు. మండలంలోని పెద్ద సిద్దాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని చిన్న సిద్దాపూర్ పోలింగ్ బూత్‌ను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో ఉందని, అధికారుల అనుమతితోనే సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో గుడుంబా విక్రయాలు చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. దసరా పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని కోరారు.

ఏరియా ఆసుపత్రిలో సరిపడా సిబ్బందిని నియమించాలి



వినతిపత్రం అందజేస్తున్న హెచ్‌ఎంఎస్ నాయకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రిలో సరిపడా సిబ్బందిని నియమించాలని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు పత్తెం రాజాబాబు అన్నారు. బుధవారం ఏరియా ఆసుపత్రి వైద్యాధికారి పాండురంగాచారికి హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో సరిపడా వైద్యులు, స్టాఫ్ నర్సులు, వార్డు బాయ్స్, ల్యాబ్ టెక్నిషియన్లు లేకపోవడంతో రోగులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందడం లేదన్నారు. ఆసుపత్రిలో మేల్, ఫిమేల్ వార్డులను పునఃప్రారంభించాలని, ఫార్మా మెడికల్ స్టోర్స్‌లో సరిపడా సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. గోలేటి డిస్పెన్సరీలో పని చేస్తున్న నర్సులు అక్కడే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సింగరేణిలో గెలిచిన ఏఐటీయూసీ నాయకత్వం మెడికల్ బోర్డును ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసి మెడికల్ అన్‌ఫిట్ కోసం దరఖాస్తు చేసుకున్న కార్మికులను అన్‌ఫిట్ చేయిస్తామని ఎన్నికల్లో ప్రగల్భాలు పలికిందన్నారు. కార్మికులకు స్థానికంగా మెరుగైన సేవలు అందించకుండా రెఫరల్ పేరుతో కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, వాటిని ఏరియా ఆసుపత్రుల ఆధునీకరణ కోసం వినియోగిస్తే కార్మికులకు స్థానికంగానే మెరుగైన వైద్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ ఓజియార్, బ్రాంచి కార్యదర్శి నవీన్, ఏరియా ఆర్గనైజర్ ఇనూస్, ఎస్‌అండ్‌పీసీ అసిస్టెంట్ ఫిట్ కార్యదర్శి కిష్టస్వామి, ఆర్గనైజర్లు మహేశ్, వేణు, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రం పరిశీలన



కేంద్రంను పరిశీలిస్తున్న అధికారులు

కౌటాల: స్థానిక సంస్థల ఎన్నికల సామగ్రి పంపిణీ కోసం కేటాయించిన కౌటాల జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం ఎంపీడీవో కోట ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ఆవరణంలో నిలిచిన వర్షపు నీటిని తొలగించాలన్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రంగా ఉంచాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలన్నారు. ఆయన వెంట ఎంఈవో హన్మంతు, ఎంపీవో మహేందర్ రెడ్డి, కార్యదర్శి సాయికృష్ణ, పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో శరన్నవరాత్రులు



అన్నదానంలో పాల్గొన్న నాగేశ్వర్‌రావు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో దేవీ శరన్నవరాత్రులు ఘనంగా జరుపుకుంటున్నారు. బుధవారం పట్టణంలోని ఆయా దేవాలయాలు, కాలనీల్లో నెలకొల్పిన దుర్గాదేవి మంటపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అన్నదానం చేపట్టారు. బీజేపీ సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్ రావు దుర్గామాత వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానంలో పాల్గొన్నారు. శరన్నవరాత్రుల్లో భాగంగా పట్టణంలోని కేశవనాథ ఆలయంలో స్వామి వారిని ఏనుగు వాహనంపై ఊరేగించారు.

బస్సుల కోసం పడిగాపులు



బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ బస్టాండ్‌లో మధ్యాహ్నం బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు పడిగాపులు పడ్డారు. దసరా పండుగ సమయంలో కాగజ్‌నగర్ నుంచి బెజ్జూరు, కౌటాల, సిర్పూర్(టి), పెంచికల్‌పేట్, మంచిర్యాల, బెల్లంపల్లి వెళ్లేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ అధికారులు స్పందించి పండుగ సమయాల్లో ప్రత్యేక బస్సులను ఆయా రూట్లలో నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు

కౌటాల: దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా బుధవారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు చే శారు. చిన్నారులను అమ్మవారి వేషధారణలో అలకరించారు. శారద దేవిని ప్రత్యేకంగా అ లంకరించి పూజలు చేశారు. అనంతరం ఉత్స వ సమితి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. నిర్వాహకులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలు కాపాడాలి



మాట్లాడుతున్న పరశురామ్

గుడిహత్నూర్: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా మాంగ్ సమాజ్ అధ్యక్షుడు గాడేకర్ పరశురామ్ అన్నారు. మండలంలోని లింగాపూర్‌లో మాంగ్ సమాజ్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళలు, యువతులు పెద్ద ఎత్తున పాల్గొనడం అభినందనీయమన్నారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న యువతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మోతివార్ శ్రీహరి, అశోక్, ఖో బ్రాజి, విశ్వనాథ్, శుభం, గణపత్, చంద్రకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరామర్శ

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత బీఆర్ఎస్ సీని యర్ నాయకుడు హైమద్ కూతురు ఇటీవల మరణించింది. కాగా.. ఆదిలాబాద్ మాజీ జె డ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ పరామర్శించారు. కార్యక్రమంలో మాజీ రిటైర్డు రాంకిషన్ నా యక్, ఈఈ జాదవ్ గుణవంత్ రావు, చౌహాన్ ర మేశ్, మడావి లక్ష్మణ్, కనకరావు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం ప్రారంభానికి ఆహ్వానం



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న సభ్యులు

కాగజ్‌నగర్ టౌన్: పట్టణంలోని సర్‌సిల్క్‌లో అనాథ వృద్ధాశ్రమాన్ని ప్రారంభోత్సవానికి ఎమ్మెల్సీ దండె విఠల్‌కు కమిటీసభ్యులు గురువారం ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ.. వద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేసి సేవలు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సభ్యులు సురేందర్ రావు, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును కమ్మేసిన ముళ్ల పొదలు



వాంకిడి: మండలంలోని జంబుల్‌ధరి గ్రామానికి వెళ్లే రహదారిని ముళ్ల పొదలు కమ్మేశాయి. చిన్న వాంకిడి గ్రామం నుంచి జంబుల్‌ధరి గ్రామం వరకు వెళ్లే రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు విపరీతంగా పెరిగాయి. పంచాయతీ అధికారులు కొంత కాలంగా పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం అవి ఏపుగా పెరిగి రోడ్డును ఆక్రమిస్తున్నాయి. దీంతో రహదారి ఇరుకుగా ఏర్పడి వాహనదారులకు ఇబ్బందిగా మారింది. రాకపోకలు సాగించే సమయంలో ముళ్లు గుచ్చుకుని గాయాలవుతున్నాయని ద్విచక్రవాహనదారులు వాపోతున్నారు. పంచాయతీ అధికారులు పొదలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

LAND FOR SALE

భూములు & ప్లాట్లు కొనబడును@ మహేశ్వరం, మన్‌సాన్‌పల్లి,నాగారం,దూబచర్ల, అమీర్‌పేట్, కొత్తూర్, కందుకూర్, పులిమామిడి,తుక్కుగూడ, శ్రీశైలంహైవే.9966521191 [SCA25008607]

SERVICES

CHANGE OF NAME

I, Sindhe Sravanthi W/o. Kadam Madhav Rao R/o. 3-181 (village), Dhagaon (Mdl) Tanoor Dist.. Nirmal .TG I have chenged my name is from Shinde Sravanthi to Kadam Sravanthi. [SCA25008605]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కొమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా: 9010608462

Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.

కొమురంభీం ఆసిఫాబాద్ :
తిరుపతి, ACO - 7997958206
సిర్పూర్ కాగజ్‌నగర్ : కె.సాయికుమార్, S.R. - 7672055661
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899